సాక్షి సంగారెడ్డి
గురువారం । 16 । జనవరి । 2025



హతవీధి

రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రంలో చేపట్టిన స్ట్రీట్ వెండర్ కియా స్కలపై నీలినీడలు కమ్ముకున్నాయి. వివరాలు 8లో ▸



అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు

సంగారెడ్డిలో ఏనుగు అంబారీపై అయ్యప్పస్వామి స్వర్ణాభరణాలు ఊరేగింపు మహోత్సవం నిర్వహించారు. వివరాలు 9లో ▸



అధ్వానంగా పట్టణ రోడ్లు

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దేశాభివృద్ధికి పాటుపడే పార్టీ కాంగ్రెస్: ఎంపీ షెట్కార్



రాష్ట్ర నాయకులతో కలసి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: అన్ని రంగాల్లో అభివృద్ధికి, పేదల సంక్షేమానికి పాటుపడే పార్టీ కాంగ్రెస్ అని ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ జాతీయ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పాల్గొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎంపీలు మల్లురవి, రఘువీరారెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పులరాజు, వంశీచంద్‌రెడ్డి తదితరులతో కలసి ఆయన ఢిల్లీకి వెళ్లి కార్యక్రమంలో పాల్గొన్నారు.

మృతుడి కుటుంబీకులకు ఎంపీ పరామర్శ

సిర్గాపూర్ మండలం పోచాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలక్కం విఠల్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకుని మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయనవెంట నాయకులు రవీందర్ పటేల్, వీరయ్యాచారి తదితరులు ఉన్నారు.

పోటీల నిర్వహణ అభినందనీయం

ఎమ్మెల్యే సునీతా రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామంలో ఐదు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో ఉన్న యువత పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చి స్నేహితులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్‌లలో పాల్గొనడం హర్షించదగ్గ పరిణామమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు పెట్టడం అభినందనీయమన్నారు.

పతంగులు ఎగురవేసిన ఎమ్మెల్యే గూడెం

పటాన్‌చెరు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని తన నివాసంలో మంగళవారం కుటుంబ సభ్యులు, మనుమలు, మనుమరాళ్లతో కలసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పతంగులు ఎగుర వేశారు. నియోజకవర్గ ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

గీతకార్మికుల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సంఘం నాయకులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. కల్లుగీత కార్మిక సంఘానికి సంబంధించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్లను బుధవారం తన నివాసంలో సంఘం నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కల్లుగీత కార్మికుల ఉపాధికోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలుచేస్తోందన్నారు. అంతకుముందు నూరు మండలంలోని సుప్రసిద్ధ నల్లపోచమ్మ ఆలయం, సంగమేశ్వర దేవాలయాలలో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజన్‌గౌడ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు మాణిక్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, జిల్లా, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ చిరు ధాన్యాలదే

వడ్డిలో ప్రారంభమైన జాతర

- వివిధ గ్రామాల నుంచి డీడీఎస్ మహిళలు రాక
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన ఐసీఏఆర్ డైరెక్టర్ మీరా, డాక్టర్ ప్రసాద్‌రావు



కోలాటం ఆడుతున్న మహిళా రైతులు

న్యాల్‌కల్ (జహీరాబాద్): మండల పరిధిలోని వడ్డి గ్రామంలో మంగళవారం నిర్వహించిన 25వ పాత పంటల జాతర ఘనంగా ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రిసెర్చ్ (ఐసీఏఆర్) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ప్రసాద్‌రావు, శాస్త్రవేత్త విజయ్ కుమార్, 'సాక్షి'దిన పత్రిక సీనియర్ జర్నలిస్ట్ పంతంగి రాంబాబు, హైకోర్టు అడ్వొకేట్ రవికుమార్, ఆయా శాఖల అధికారులు, నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ... పాత పంటలకు మంచి రోజులు రానున్నాయని, ప్రస్తుతం ప్రపంచస్థాయిలో 135 బిలియన్ డాలర్ల చిరు ధాన్యాల వ్యాపారం కొనసాగుతోందని అన్నారు. రాబోయే ఆరేళ్లలో చిరు ధాన్యాలు135 బిలియన్ డాలర్ల నుంచి 300 బిలియన్ల డాలర్ల బిజినెస్‌కు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 44 లక్షల హెక్టార్లలో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం జరుగుతుందని తెలిపారు. జహీరాబాద్ మిల్లెట్ బ్రాండ్‌గా గుర్తింపు వచ్చేలా చర్యలు చేపడదామని పిలుపునిచ్చారు.

మరో ప్రాసెసింగ్ యూనిట్‌కు హామీ...

జహీరాబాద్ ప్రాంతంలోని మాచ్‌నూర్‌లో ప్రాసెసింగ్ యూనిట్ ఉందని, మరో యూనిట్‌ను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మీరా వెల్లడించారు. డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ... పాత పంటలైన చిరు ధాన్యాలను తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పాత పంటలు కనుమరుగవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ...ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండాలంటే ఎన్నో పోషకాలు కలిగిన పాత పంటలను ఆహారంగా తీసుకోవాలన్నారు. సీనియర్ జర్నలిస్టు పంతంగి రాంబాబు మాట్లాడుతూ..మన ఆరోగ్యంతోపాటు పశువులు, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని, అది కేవలం పాత పంటల వల్లే సాధ్యమవుతుందన్నారు. ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా పాత పంటలను పండించడం వల్ల అటు నేలకు ఇటు పశువులకు, మనకు మంచి పోషకాలు అందుతున్నాయని తెలిపారు. అంతకుముందు పాత పంటల ధాన్యంతో కూడిన ఎడ్ల బండ్లను వీధుల్లో ఊరేగించారు. పాత పంటల సాగులో ప్రత్యేక చొరవ చూపిన మహిళలు వడ్డి గ్రామానికి చెందిన శోభమ్మ, ఎల్గోయి గ్రామానికి చెందిన నర్సమ్మ, అనుషమ్మ, కాశీంపూర్‌కు చెందిన లచ్చమ్మ, పాట్‌పల్లికి చెందిన రత్నమ్మలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. పాత పంటలతో తయారు చేసిన వంటకాలను విక్రయించారు. స్థానిక పాఠశాలలో పాత పంటలతో కూడిన పంటకాలను ముఖ్య అతిథులు, అధికారులు, నాయకులు రుచి చూశారు. కార్యక్రమంలో జహీరాబాద్ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మెన్ తిరుపతిరెడ్డి, జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంత్, సామాజిక కార్యకర్త ఉషా సీతాలక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్, డీడీఎస్ కో-ఆర్డినేటర్ పూలమ్మ, జాయింట్ డైరెక్టర్ గిరిధర్‌బాబు రైతులు పాల్గొన్నారు.



ప్రదర్శనకు ఉంచిన చిరు ధాన్యాలు



మహిళా రైతులను సత్కరిస్తున్న మీరా తదితరులు



మహిళా రైతులు, చిన్నారులతో ఐసీఏఆర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా

ఉల్లాసంగా...ఉత్సాహంగా..

పతంగులు ఎగుర వేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



క్యాంపు కార్యాలయంలో పతంగులు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వేర్వేరు చోట్ల పతంగులు ఎగుర వేసి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో కలసి ఉత్సాహంగా ఎమ్మెల్యే చింతా పతంగులు ఎగురవేశారు. సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందని ఎమ్మెల్యే ఆరోపించారు.రైతులకు మంచి చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిని ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఇక స్థానిక రామ్ మందిర్ భక్త మండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలసి జగ్గారెడ్డి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. అందరితో కలసి సరదాగా పతంగులను ఎగురవేశారు. అనంతరం కార్యకర్తలతో సినిమా పాటలకు స్టెప్పులు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి నర్సింలు, జీవీ శ్రీనివాస్, విఠల్, శ్రవణ్‌రెడ్డి, వాజిత్, అజీమ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వర్ణాభరణోత్సవం



స్వర్ణాభరణాల ఊరేగింపులో జగ్గారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని అయ్యప్ప మందిరంలో మంగళవారం గురుస్వాములు సుధాకర్‌గౌడ్, గోనెశంకర్‌ల ఆధ్వర్యంలో మకరజ్యోతి స్వర్ణాభరణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ సంగమేశ్వర ఆలయం నుంచి స్వర్ణాభరణాల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప స్వాములు స్వర్ణాభరణాలను నెత్తిన పెట్టుకుని పేటైతుళ్లి ఆడుతూ, కోలాటాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. బస్టాండ్ నుంచి దుర్గభవానీమందిరం వరకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఊరేగింపులో పాల్గొన్నారు. సుభాష్‌రోడ్డు, శాస్త్రీ రోడ్, బస్టాండ్, గోల్లకేరీ, దుర్గాభవానీమందిరం, చెన్నబసవేశ్వర, శ్రీగడిమైసమ్మ మందిరం నుంచి గాంధీచౌక్, గురునగర్ కాలనీ రోడ్డు మీదుగా అయ్యప్ప మందిరం వరకు ఈ ఊరేగింపు సాగింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొండా సురేఖ
- ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేవిధంగా చూడాలని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని దేవదాయశాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు రాహుల్ రాజ్, వల్లూరు క్రాంతి, మిక్కిలినేని మను చౌదరిలతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాజ్యాంగం అమలులోకి వచ్చి ఈనెల 26 నాటికి 75 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసేందుకు నిర్ణయించిందన్నారు. పథకాల విజయవంతం చేసేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి వారి భూములకు సంబంధించిన వివరాలను డిక్లరేషన్ తీసుకుంటే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వుంటుందని, ఈ దిశగా ఆలోచన చేయాలని మంత్రి సురేఖ కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా గుర్తించిన వారిలో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు.

'వన్ రేషన్ - వన్ స్టేట్'గా రేషన్ కార్డులు

గతంలో అమలు చేసిన మార్గదర్శకాల మేరకే రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ఒక వ్యక్తికి ఒకే చోట రేషన్ కార్డు వుండేలా చర్యలు తీసుకోవడంతో పాటు 'వన్ రేషన్ - వన్ స్టేట్'గా రేషన్ కార్డులు జారీ ప్రక్రియను చేపట్టాలని సూచించారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ

కొత్తగా అమలు చేయనున్న పథకాలకు సంబంధించి ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సురేఖ సమాధానమిచ్చారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియని, అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాల ప్రయోజనాలు దక్కుతాయని వారికి స్పష్టం చేశారు. ఈనెల 26 నుంచి నూతన పథకాల అమలులో ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా అత్యుత్తమ పనితీరును కనబర్చాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలకు వెనుకాడనని హెచ్చరించారు.

26 లోపు ఎంపిక పూర్తి కావాలి: కలెక్టర్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీలలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈనెల 26లోపు పూర్తి కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకతతో జరిగేలా గ్రామాలు వార్డులలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పీడీ డీఆర్డీఏ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, హౌసింగ్ పీడీ చలపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పాల్గొన్నారు.

సంక్షేమానికి సమాయత్తం

- 21 నుంచి గ్రామ, వార్డు సభల నిర్వహణ
- అందులోనే లబ్ధిదారుల ఎంపిక
- రైతు భరోసా సాగు భూములను గుర్తించేందుకు గూగుల్‌మ్యాప్‌లు..
- స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకాల అమలుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఈనెల 26 నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టారు. ఈ పథకాల అర్హులను గుర్తించేందుకు ఈనెల 21 నుంచి 24 వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను నిర్వహించనున్నారు. ఈ సభల నిర్వహణ కోసం మండల స్థాయిల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, వ్యవసాయ అధికారులు, ఇలా అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఆయా పథకాల లబ్ధిదారుల ను గుర్తించేందుకు గ్రామ సభలను నిర్వహించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక..

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఇటీవలే ముగిసిన విషయం తెలిసిందే. ఈ గృహాల కోసం జిల్లాలో మొత్తం 6.98 లక్షల దరఖాస్తులు రాగా, క్షేత్ర స్థాయిలో పర్యటించిన అధికారులు వీటిని స్వయంగా సర్వే చేసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఇప్పుడు గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూర య్యాయి. మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్న వారికి ప్రాధాన్యత నిస్తారు. లబ్ధిదారుల ఎంపికలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. ఈ ఇళ్ల లబ్ధిదారుల జాబితా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా ఆమోదం పొందాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

గూగుల్ మ్యాప్, విలేజ్ మ్యాప్‌ల ఆధారంగా..

సాగుకు యోగ్యమైన భూములకే రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. గూగుల్‌మ్యాప్‌లు, విలేజ్ మ్యాప్‌ల ఆధారంగా ఈ సాగు యోగ్యమైన భూములను గుర్తించాలని అధికారులు నిర్ణయించారు. మండల రెవెన్యూ, వ్యవసాయ అధికారుల నేతృత్వంలోని కమిటీ ఈ భూములను గుర్తించనుంది. ఈనెల 20లోగా ఈ పరిశీలన పూర్తి చేయనున్నారు. ఈ రైతు భరోసా పథకం లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ఆమోదం తీసుకోనున్నారు.

ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం..

ఈ సంక్షేమ పథకాల అమలు..లబ్ధిదారుల ఎంపికలో ఇటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఇటు జిల్లా కలెక్టర్లతో పాటు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొన్నారు. ప్రతిపక్షపార్టీల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా ఈ టెలీకాన్ఫరెన్స్‌కు హాజరు కావడం గమనార్హం.

సీఆర్‌డీకి వ్యవసాయ కూలీల వివరాలు..

నిరుపేద వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. 2023-24 ఆర్థిక ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీల వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సీఆర్‌డీకి పంపారు.

'సాక్షి' కలిపింది ఈ ఇద్దరినీ...

- ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ప్రచురితమైన కథనం
- దాని ఆధారంగా తెలిసిన మిత్రుడి ఆచూకీ
- 39 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు



ఆనంద్ కుటుంబ సభ్యులతో డీఎస్పీ నూకల వేణుగోపాల్ రెడ్డి



'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తన చిన్ననాటి స్నేహితుడిని చూడాలని ఉందంటూ ఓ పోలీస్ అధికారి వెల్లడించిన మనోగతాన్ని గతేడాది ఫ్రెండ్షిప్ డే సందర్భంగా 'సాక్షి'ప్రచురించింది. ఆ కథనమే వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయి మిత్రుడి ఆచూకీ తెలిసేలా చేసింది. ఈ సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆ ఇద్దరు మిత్రులు ప్రత్యక్షంగా కలుసుకుని చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా విధులను నిర్వహిస్తున్న నూకల వేణుగోపాల్‌రెడ్డి ఆగస్టు నెలలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి'దిన పత్రికతో 39ఏళ్లుగా తన బాల్యమిత్రుడి కోసం చేస్తున్న అన్వేషణ గురించి వివరించారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు చదువుకున్న సమయంలో తన బాల్యమిత్రుడైన ఎం.ఆనంద్ గురించి తెలిపారు. అతడిని ఎలాగైనా కలవాలని పట్టుదలతో ఉన్నట్లు తెలిపారు. ఆ కథనం 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైంది. ఆ కథనాన్ని స్నేహితులకు, ఇతర వాట్సాప్ గ్రూపులలో షేర్ చేశారు. దానిని చూసిన ఆయన స్వగ్రామానికి చెందిన స్నేహితులు సైతం అన్వేషణ మొదలుపెట్టారు. ఎట్టకేలకు ఎం.ఆనంద్ హైదరాబాద్‌లోనే ఉన్నట్లు గుర్తించి అతడిని చిరునామా తెలుసుకున్నారు. దీంతో వేణుగోపాల్‌రెడ్డి సంక్రాంతి పండుగ రోజున తన బాల్యమిత్రుడు ఆనంద్ ఇంటికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... 'సాక్షి'లో వచ్చిన కథనం తన బాల్యమిత్రుడిని కలిసేలా చేసిందని, పత్రికతో పాటు అందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నేళ్ల తర్వాత తన బాల్యమిత్రుడిని కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

దుబ్బాకటౌన్: మహిళ అదృశ్యమైన ఘటన రాయపోల్ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గొల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉదయ్‌పూర్ గ్రామానికి చెందిన సాక్కం సుజాత-చంద్రం దంపతులు బతుకుదెరువు కోసం పదేళ్ల కిందట మేడ్చల్ వలస వెళ్లారు. ఇటీవలె సొంత ఊరు ఉదయ్‌పూర్‌కి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. 9 తేదీన సాక్కం సుజాత ఇంటి నుంచి వెళ్లి కనిపించడం లేదు. బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సుజాత భర్త చంద్రం బుధవారం రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ దేవయ్య తెలిపారు.

దొంగతనం కేసులో ఐదుగురు అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): దొంగతనం కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండల కేంద్రంలో హర్షిక స్టీల్ కంపెనీ నిర్మాణం కోసం కొన్ని యంత్రాలను తీసుకొచ్చి తమ ప్రహరీ లోపల పెట్టుకుంది. ఇది గమనించి చిన్నశంకరంపేటకు చెందిన రమేశ్, రామచంద్రం, సురేశ్, నాగరాజు, బాబు ఇనుప సామగ్రిని తరలించి సొమ్ము చేసుకోవాలని చూశారు. 10న రాత్రి ఇనుప గేర్ రాడ్‌ను దొంగలించి స్థానికంగా పొలం వద్ద దాచారు. బుధవారం రోజు ఇనుప సామగ్రిని అమ్ముకునేందుకు తీసుకెళ్తున్న క్రమంలో పోలీస్‌లకు పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి


పాడి గేదె వద్ద బాధిత రైతు

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని సిర్సనగండ్లలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు దేవిరెడ్డి రాంరెడ్డి రోజూమాదిరి మంగళవారం రాత్రి వ్యవసాయ బావి వద్ద ఉన్న షెడ్డులో గేదెను కట్టేసి ఇంటికెళ్లాడు. గురువారం ఉదయం వెళ్లేసరికి షెడ్డు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె మృతి చెంది కనిపించింది. వెంటనే విద్యుత్ అధికారులు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. గేదె విలువ రూ.70 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

గడ్డి గోదాంలో అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సంగారెడ్డి క్రైమ్: గడ్డి గోదాంలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన సంగారెడ్డి పట్టణంలోని వృక్షకాలనీలో బుధవారం చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ ఫైర్ ఎస్‌ఐ కిరణ్ రెడ్డి కథనం మేరకు.. మహ్మమద్ సాబెర్ ఖురేషి వృత్తి రీత్యా మటన్ షాపు నడుపుతున్నాడు. ఇంటి ఎదుటు ఖాళీ స్థలంలో చిన్న గోదాంలో గడ్డిని నిల్వ ఉంచాడు. బుధవారం ఒక్కసారిగా గడ్డివాములో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వచ్చి మంటలార్పివేశారు. అప్పటికే సుమారు 1,000 కట్టల గడ్డి దగ్ధం అయ్యింది. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

హాత వీధి

కీయాస్క్‌లపై నీలినీడలు

- నిరుపయోగంగా 40 దుకాణాలు
- వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి కేటాయింపు
- అవగాహన లోపంతో వినియోగించుకోని వైనం
- సవాలక్ష కారణాలతో విముఖత
- తప్పని సమీక్ష


జిల్లా కేంద్రంలో వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెండర్స్ కీయాస్క్‌లు

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రంలో చేపట్టిన స్ట్రీట్ వెండర్ కీయాస్కలపై నీలినీడలు కమ్ముకున్నాయి. మెప్మా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మంచి ఆలోచనతో చేపట్టిన ప్రక్రియ సత్ఫలితాలను అందించలేకుండా పోతుంది. ప్రధానంగా స్ట్రీట్ వెండర్స్‌ను చైతన్యం చేసి కీయాస్కలను వినియోగంలోకి తేవడంలో బల్దియా అడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. కీయాస్కలను సక్రమంగా అమలు చేస్తే బల్దియాకు ఆదాయ వనరులతోపాటు స్ట్రీట్ వెండర్స్‌కు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తా ప్రాంతంలో 2022లో సుమారు రూ.1.20 కోట్ల అంచనా ప్రాజెక్టుతో అప్పట్లో ప్రభుత్వం 40 స్ట్రీట్ వెండర్ కీయాస్కలను ఏర్పాటు చేసింది. మోడల్ సిటీ లక్ష్యంగా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, వీధి వ్యాపారులకు ఉపాధి అందించే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్రంలో రోల్ మోడల్‌గా కీయాస్కలను ఏర్పాటు చేశారు. అప్పట్లోనే వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 600 పైగా దరఖాస్తులు రాగా వారిలో డ్రా పద్ధతిలో 40 మందికి కీయాస్కలను కేటాయించారు. ప్రతీ ఒక్క కీయాస్కకు రూ.500 అద్దె ప్రాతిపదికన బల్దియా వారి నుంచి వసూలు చేయాలని నిర్ణయించింది.

లక్ష్యానికి దూరంగా..

జిల్లా కేంద్రంలో పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మున్సిపల్ కీయాస్క్ ప్రక్రియను చేపట్టింది. అప్పటికే పట్టణంలో ఇష్టానుసారంగా రోడ్లపై విక్రయాలు చేస్తున్న స్ట్రీట్ వెండర్స్‌కు ఒక శాశ్వత పరిష్కారం చూపే దిశగా స్ట్రీట్ వెండర్ జోన్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో రోడ్లపై తోపుడు బండ్లు, ఇతర వాహనాల ద్వారా వీధి వ్యాపారులపై దృష్టి సారించింది. అందులో భాగంగానే 40 స్ట్రీట్ వెండర్ కీయాస్కలను నిర్మించి వీధి వ్యాపారులకు కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ డ్రా పద్ధతిలో కీయాస్కలను సొంతం చేసుకున్న వారు వాటిని సక్రమంగా వినియోగించేలా చేయడంలో మెప్మా ఆశించిన స్థాయిలో దృష్టిట్ సారించలేక పోయింది. దీంతో డ్రాలో కీయాస్కలను పొందిన వారిలో స్వల్పంగా వినియోగించడంతో ఆశించిన సత్ఫలితాలు రావడం లేదు. రూ.కోట్లు పెట్టి కీయాస్కలను ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటికీ పట్టణంలో ఎక్కడికక్కడ స్ట్రీట్ వెండర్స్ వ్యాపారం కొనగిస్తున్నారు.

చొరవ చూపితే ప్రయోజనమే..

కీయాస్కలను సంపూర్ణంగా వినియోగించేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే బల్దియాకు ఆదాయంతోపాటు ప్రభుత్వ లక్ష్యానికి సార్థకత ఉంటుంది. అందుకు సంబంధించిన మెప్మా, స్ట్రీట్ వెండర్స్ కమిటీ వీధి వ్యాపారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కీయాస్క ఉద్దేశ్యం, వాటి వల్ల ప్రయోజనాలను వివరించే బాధ్యత బల్దియా చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..



పట్టణంలో స్ట్రీట్ వెండర్స్ కీయాస్క లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. డ్రా పద్ధతిలో వాటిని పొందిన వీధి వ్యాపారులు తప్పనిసరి వినియోగించేలా చూస్తాం. అవసరమైతే వారికి అవగాహన కల్పిస్తాం. బల్దియాకు ఆదాయ వనరులు సమకూరే ప్రతీ ప్రక్రియను పటిష్టంగా అమలు చేస్తాం.

–ఆశ్రిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

భార్యతో గొడవపడి భర్త


దినేశ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. నిజాంపేటకు చెందిన దినేశ్ (27)కి ఏడాది కిందట పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిరామ్ కాలనీకి చెందిన నిఖితతో ప్రేమ వివాహం జరిగింది. దినేశ్ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడు. 13వ తేదీ రాత్రి భోజనం విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. మరుసటి రోజు ఉదయం మరోసారి గొడవ జరగడంతో దినేశ్ భార్య ఇంట్లో ఉండగానే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సహకారంతో భార్య ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదానికి బానిసై వ్యక్తి


నాగరాజు (ఫైల్)

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ అభిమాన్ సింగ్ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన నాగరాజు (39) మద్యంతోపాటు జూదానికి బానిసై డబ్బులు ఇవ్వాలని ఇంట్లో భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి భార్యని డబ్బులు అడుగగా ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లోకి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మనీలా బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి


శ్రీనివాస్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసున్నాడు. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ కథనం మేరకు.. మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ (38) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ మద్యం సేవిస్తూ ఇంట్లో భార్యతో గొడవ పడుతుండేవాడు. మూడు రోజుల కిందట భార్య రమ్య ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది శ్రీనివాస్ మంగళవారం ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

చీకట్లో కనిపించక వ్యక్తిని ఢీకొట్టిన బైక్


సంపత్(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై మహేశ్ కథనం మేరకు.. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన సంపత్(45) వృత్తి రీత్యా లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ రోజు మంగళవారం రాత్రి హుస్నాబాద్ నుంచి చౌటపల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో మరో వ్యక్తి లిఫ్ట్ అడిగాడు. బైక్ లైట్ ఫోకస్‌కు ఆ వ్యక్తి కనబడకపోవడంతో సంపత్ అతడిని ఢీకొట్టి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య తిరుమల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ బోల్తా


అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన లారీ

చిన్నశంకరంపేట(మెదక్): లారీ బోల్తా పడిన ఘటన పేట మండల కేంద్రంలోని మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన లారీ స్క్రాప్‌లోడ్ తీసుకొచ్చి స్థానిక స్టీల్ పరిశ్రమలో అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తుంది. మార్గమధ్యలో చేగుంట వైపు నుంచి వస్తున్న ఆర్‌టీసీ బస్సు బైక్‌ను తప్పించబోయి లారీకి ఎదురుగా వచ్చింది. లారీ డ్రైవర్ సడన్‌గా రోడ్డు పక్కకు లారీని తిప్పడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా, ఆర్టీసీ బస్సు తృటిలో ప్రమాదం నుంచి బయటపడింది.

ఘనంగా మల్లికార్జుస్వామి బ్రహ్మోత్సవాలు


బోనం మొక్కులు చెల్లిస్తున్న మహిళలు


అగ్ని గుండాలు దాటుతున్న భక్తులు

- బోనాలతో తరలివచ్చిన భక్తులు
- జోరుగా ఎడ్ల బండ్ల ప్రదక్షిణలు, అగ్నిగుండాలు

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి శ్రీ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం తెల్లవారు జామున అగ్ని గుండాలతో ఘనంగా ముగిశాయి. సోమవారం శివకల్యాణంతో ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం బోనాలు, ఎడ్ల బండ్ల ప్రదక్షిణలు నిర్వహించారు. రాత్రి స్వామి వారికి భక్తులు బోనాలు సమర్పించారు. అలాగే పట్నాలు వేసే కార్యక్రమాలు నిర్వహించారు. పొట్లపల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి 202 ఏళ్ల చరిత్ర ఉండటంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కలు సమర్పించారు. పిల్లజెల్ల బాగుండాలి, పాడి పంటలు సమృద్ధిగా అభివృద్ధి చెందాలని కోరుతూ బండ్లు, ట్రాక్టర్లతో ఆలయం చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేశారు. కోరిన కొర్కెలు తీర్చే దైవంగా భావించే మల్లికార్జునస్వామికి యువతి, యువకులు బోనాలు, దీపాలతో ప్రదక్షిణలు చేశారు. స్వామి కటాక్షం కోసం భక్తులు అగ్ని గుండాలను దాటేందుకు ఉత్సాహం చూపించారు. ఉత్సవాల్లో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల నర్సింహారెడ్డి, కానుగుల మోహన్, మార్క అనిల్ కుమార్, మార్క చంద్రయ్య, గడ్డం మల్లయ్య, జగదీశ్వర్, పాకాల శ్యాంసుందర్, కర్ర రవీందర్‌రెడ్డి, గాజుల చంద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట యువతి


ప్రశంసాపత్రాలతో యువతీయువకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్నేషనల్ సౌత్ ఏషియన్ పీస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్లు సిద్దిపేట జిల్లాకు చెందిన యువతి మూర్తి శ్రీహితారెడ్డి బుధవారం తెలిపారు. ఏపీలోని కర్నూల్ జిల్లా కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నాలుగు రోజుల పాటు జరిగిన ఇంటర్నేషనల్ సౌత్ ఏషియన్ పీస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రాష్ట్రం నుంచి తనతోపాటు 19 మంది పాల్గొన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విశిష్టతను తెలుపుతూ ప్రసంగించినట్లు పేర్కొన్నారు. యువతీ యువకులు కలిసి తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలను, కళా నైపుణ్యాలను ప్రదర్శించినందుకు నేషనల్ యూత్ ప్రాజెక్ట్ సౌత్ రీజినల్ కోఆర్డినేటర్ కన్నె యాదవ రాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు పేర్కొన్నారు.

కంకర పోశారు.. వదిలేశారు

- అక్కన్నపేట మండలంలో అధ్వానంగా రోడ్లు


కంకర తేలిన రోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అటు ప్రజలు ఇటు రైతుల పాలిట శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం కట్కూర్ నుంచి దాస్‌తండా, వంకాయతండా వయా పంచరాయితండాలకు వెళ్లే కంకర రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుకు గత ప్రభుత్వ హయాంలో గిరిజన శాఖ కింద రూ.3.20 కోట్లు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించి కంకర పోసి బీటీ రోడ్డు నిర్మాణం వేయలేదు. దీంతో అదే కంకర రోడ్డుపై నిత్యం వందలాది మంది రైతులు, ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. వంకాయతండా, దాస్, పంచరాయితండాల రైతులు ఉదయం, సాయంత్రం పాలు పోసేందుకు కట్కూర్‌లోని పాల కేంద్రానికి వెళ్తుంటారు. ఇటీవల ఓ రైతు ప్రమాదానికి గురయ్యాడు. ఐదారు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడి వాహనదారులు గాయాలపాలయ్యారు. ఇకనైనా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి బీటీ రోడ్డు వేయించాలని రైతులు కోరుతున్నారు.

గోల్డ్ కప్ విజేత నాగర్‌కర్నూల్


కప్ అందజేస్తున్న రామచంద్రన్, గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: అంతర్రాష్ట్రీయ కీజర్ యాఫై గోల్డ్ కప్‌ను డాలీ సీసీ నాగర్ కర్నూల్ జట్టు గెలుచుకుంది. పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో పది రోజులపాటు జరిగిన అంతరాష్ట్రీయ గోల్డ్ కప్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌కు దేశంలోని 16 జట్లు పాల్గొన్నాయి. డాలీ సీసీ నాగర్‌కర్నూల్, నేషనల్ కలీమ్ ఎలెవెన్ జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా జరిగి మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన నాగర్ కర్నూల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 167 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం నేషన్ కలీమ్ జట్టు 20 ఓవర్లలో 164 రన్స్ చేసి 3 పరుగుల తేడాతో ఓడిపోయింది. విజేత జట్టుకు గోల్డెన్ కప్‌తో పాటు రూ.6,11,111 లక్షల ప్రైజ్ మనీ అందజేశారు. రన్నరప్‌కు రూ. 3,55,555 లక్షల చెక్కును ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీవై పార్టీ అధినేత రామచంద్రన్ యాదవ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ చైర్మన్ తన్వీర్, టోర్నీ నిర్వాహకులు ఖిజర్ యాఫై, టోర్నమెంట్ పర్యవేక్షులు రాములునేత, సయ్యద్ మహబూబ్, విజయ్, అబ్దుల్లా, ఆదయ్ యాఫై, అథిల్ యాఫై తదితరులు పాల్గొన్నారు.

బార్‌లో కత్తులతో హల్‌చల్

ముగ్గురిపై కేసు

తూప్రాన్: మద్యం కోసం ముగ్గురు యువకులు కత్తులతో బారులో హల్‌చల్ చేశారు. ఎస్‌ఐ శివానందం బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న దారువాల బార్ రాత్రి బంద్ చేసిన అనంతరం ముగ్గురు వ్యక్తులు వచ్చారు. మద్యం కావాలని డిమాండ్ చేస్తూ కత్తులతో భయభ్రాంతులకు గురి చేశారు. వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని సంతోష్ సింగ్‌తోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

నమ్మించి.. నట్టేట ముంచి..

- పోషిస్తానని మాయమాటలు చెప్పి భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి
- న్యాయం చేయాలని బాధిత రైతు వేడుకోలు


మాట్లాడుతున్న రైతు భీమిని విఠల్

నారాయణఖేడ్: తనకు సంతానం లేకపోవడంతో పోషిస్తానని నమ్మించి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఖేడ్ మండలం గంగాపూర్‌కు చెందిన రైతు భీమిని విఠల్ తన గోడు వెళ్లబోసుకున్నాడు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తనకు సంతానం లేకపోవడంతో నేను పోషిస్తానని చెప్పి తన భార్య చెల్లెలి కుమారుడు రాయికోడు మండలం సంగాపూర్‌కు చెందిన అంజయ్య ఏడాది కిందట ఇంటికొచ్చాడన్నారు. నాలుగు నెలలపాటు ఉండి బాగోగులు చూసుకుంటున్నాడన్నారు. మాయమాటలతో తనను నమ్మించి నాలుగు ఎకరాలను అతడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. ఆ తర్వాత సొంతూరికి వెళ్లి రావడంలేదన్నారు. తన ఆరోగ్యం బాగాలేక పలుమార్లు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఆ భూమిని తిరిగి తనపేరిట రిజిస్ట్రేషన్ చేయించి న్యాయం చేయాలని కోరారు. అతడి వెంట మాజీ ఎంపీటీసీ దత్తాగౌడ్, బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, నాయకులు శంకర్ ముదిరాజ్ ఉన్నారు. బాధితుడికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అత్యాచార ఘటనలో ముగ్గురు రిమాండ్


మాట్లాడుతున్న సీఐ వెంకట్ రాజాగౌడ్

చేగుంట(తూప్రాన్): మాసాయిపేట మండలం రామంతాపూర్‌లో ఇటీవల జరిగిన అత్యాచార ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ తెలిపారు. మంగళవారం చేగుంటలో విలేకరుల సమావేశంలో సీఐ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రామంతాపూర్ గ్రామానికి చెందిన భవాని స్వామి అనే రైతుకు చెందిన పాడి గేదెలు 8న లింగారెడ్డిపల్లి దారిలోని పశువుల పాక నుంచి అపహరణకు గురయ్యాయి. మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా పశువుల ఆచూకీ కోసం దాబాలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ముగ్గురు వ్యక్తులు మతిస్థిమితం లేని మహిళపై 8న రాత్రి లైంగిక దాడికి పాల్పడినట్లు రికార్డు అయ్యింది. ఈ విషయంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టగా చేగుంట నుంచి కోళ్లను సరఫరా చేసే వ్యాన్‌పై పని చేసే వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే విచారణ చేపట్టి లైంగిక దాడికి పాల్పడిన నిందితులు అఫ్రోజ్, సాహిల్, బసవరాజ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరళించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డితోపాటు స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పండుగని పురస్కరించుకుని మూడు రోజులుగా సంగారెడ్డి జిల్లాలోని పల్లెల్లో పట్టణాలలో సంబురాలు జోరుగా జరుగుతున్నాయి. ఏ ఇంటి ముందు చూసినా రంగురంగుల ముగ్గులు స్వాగతం పలుకుతున్నాయి. మహిళలు, యువతులు ఉదయాన్నే మేల్కొని కల్లాపి చల్లి పెద్దపెద్ద ముగ్గులు వేసి ఆకర్షణీయంగా రంగులద్దారు. యువకులు, చిన్నారులు భవనాలమీదికెక్కి పతంగులు ఎగురవేస్తూ సందడి చేశారు. ఇళ్ల ముందు గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతీ ఇంట్లో ఎక్కడెక్కడో ఉన్న కుటుంబ సభ్యులంతా ఒక చోట చేరి విందు భోజనాలు చేసుకుని ఆత్మీయంగా గడిపారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి


సంగారెడ్డి శాంతినగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు


పతంగులు ఎగురవేస్తున్న యువకులు, చిన్నారులు


గంగిరెద్దు సందడి


పతంగి చరకాతో చిన్నారి


సంగారెడ్డి తిరుమల ఎన్‌క్లేవ్ లో రంగురంగుల ముగ్గు వేస్తున్న యువతులు, చిన్నారులు